ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

విజయనగరం


జిల్లా వార్తలు

శుక్రవారం 31 అక్టోబరు 2025

భూసేకరణ వేగవంతం: కలెక్టర్

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ ప్రాజెక్టుల కోసం చేపడుతున్న భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ రామసుందర్ రెడ్డి ఆదేశించారు. గురువారం తన చాంబర్లో ముగ్గురు ఆర్‌డీవోలతో భూసేకరణపై సమీక్షించారు. జాతీయ రహదారులు, భోగాపురం ఎయిర్‌పోర్టు, ట్రైబల్ యూనివర్సిటీ, రెల్లి వద్ద గ్రేహౌండ్స్‌కి కేటాయించిన భూమి, ఎంఎస్ఎంఈల కోసం భూసేకరణ, మురుగునీటి ట్రీట్మెంట్ ప్లాంట్, రైతు బజారు, విజయనగరం డిగ్రీ కళాశాలకు వేణుగోపాలపురం వద్ద కేటాయించిన భూమి, డిజిటల్ లైబ్రరీ తదితర అంశాలపై చర్చించారు.

జిల్లా ముఖచిత్రం మారుతుందా?



- విశాఖలో ఎస్.కోట విలీనం లేనట్టే? • తెరపైకి ఒకే నియోజకవర్గం.. ఒకే రెవెన్యూ డివిజన్
- బొబ్బిలి, విజయనగరం డివిజన్లలో మార్పు అనివార్యం • చీపురుపల్లి యథాతథం
- కేబినెట్ సబ్ కమిటీ నుంచి ప్రతిపాదనల స్వీకరణ

విజయనగరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి)

జిల్లా భౌగోళిక స్థితిగతులు స్వల్పంగా మారే పరిస్థితి కనిపిస్తోంది. హద్దులు, రెవెన్యూ డివిజన్ పరిధిలో మార్పులపై ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఈ విషయమై ఏర్పాటుచేసిన కేబినెట్ సబ్‌కమిటీతో రెండుసార్లు సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా కొత్త జిల్లాల ఏర్పాటు, రెవెన్యూ డివిజన్ల మార్పులు, ఇతర చేర్పులకు సంబంధించి ప్రతిపాదనలను కేబినెట్ సబ్ కమిటీ ప్రభుత్వానికి తాజాగా అందజేసింది. అయితే మన జిల్లాకు సంబంధించి ఎటువంటి ప్రతిపాదనలు ఇవ్వలేదని తెలుస్తోంది. తమను విశాఖ జిల్లాలో కలపాలని ఎస్.కోట నియోజకవర్గ ప్రజలు డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోలేదని తెలుస్తోంది. ఎస్.కోట అసెంబ్లీ నియోజకవర్గం విశాఖ పార్లమెంట్ స్థానం పరిధిలో ఉండడంతో ఈ డిమాండ్ తెరపైకి వచ్చింది. అయితే విజయనగరం పార్లమెంటరీ పరిధిలో ఉన్న శ్రీకాకుళం జిల్లాలోని ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గం విషయంలోనూ ఇదే సమస్య రాగా వదులుకునేందుకు శ్రీకాకుళం జిల్లా ప్రజలు



ఎంతమాత్రం అంగీకరించలేదు. ఈ పరిస్థితి దృష్ట్యా ఎస్.కోటను విజయనగరంలో, ఎచ్చెర్లను శ్రీకాకుళంలో కొనసాగించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇంకోవైపు శ్రీకాకుళం జిల్లాలోని రాజాం అసెంబ్లీ నియోజకవర్గాన్ని విజయనగరం జిల్లాలో కలిపారు. పాలకొండ నియోజకవర్గాన్ని (మిగతా 8వ పేజీలో..)



చీపురుపల్లి



బొబ్బిలి



ఎస్.కోటలో వరి పంటను నిలబెడుతున్న మహిళా రైతు



సంతకవిటి: నారాయణపురం ఆనకట్ట వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న నాగావళి నది

ఎంత కష్టం!

- భారీ వర్షాలతో ప్రజలకు అగచాట్లు
- వరద నీటిలో వరి పంట • గిరిజన, పల్లపు ప్రాంతాల్లో పట్టు తప్పిన ఇళ్లు
- అస్తవ్యస్తంగా పరిసరాలు • ధ్వంసమైన రహదారులు

శృంగవరపుకోట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి):

- శృంగవరపుకోట మండలం దారపర్తి గిరిశిఖర పంచాయతీ పరిధిలోని పలు గిరిజనుల ఇళ్లల్లోకి ఊట నీరు వస్తోంది. గోడలన్నీ నానిపోయాయి. ఆహార పదార్థాలు దాచుకొనేందుకు సరైన స్థలం లేదు.
- తాటిపూడి జలాశయంలోకి చేరుతున్న వరద నీటినంతటినీ గోస్తనీ నదిలోకి వదులుతున్నారు. దీంతో నదీ పరివాహక ప్రాంతానికి ఆనుకుని ఉన్న ఎస్.కోట, జామి మండలాల రైతులు పొలాలు, పశువుల కళ్లాలకు వెళ్లేందుకు నానా అవస్థలు పడుతున్నారు.
- శృంగవరపుకోట మండలం సంతగైరమ్మపేట వద్ద గెడ్డ నేటికీ ఉధృతంగా పారుతోంది. దీన్నుంచి వచ్చే నీరంతా గ్రామంలోకి చేరడంతో పాఠశాల పూర్తిగా నీట మునిగింది. ఇంకా నీరు తగ్గలేదు.
- శృంగవరపుకోట నియోజకవర్గంలోని 47 గ్రామాల్లో 661 రైతులకు చెందిన 316 హెక్టార్లలో వరి పంట నీట మునిగింది. పొలాలను చూస్తున్న రైతులు కంట నీరు పెడుతున్నారు.
- ఎస్.కోట నుంచి అరకు పర్యాటక ప్రాంతానికి ఆర్టీసీ బస్సులను ఆపేశారు. కొండప్రాంతం కావడంతో పాటు గాలి కొండ వద్ద కొండచరియలు పడే ప్రమాదం ఉందని గుర్తించి ఈ నిర్ణయం తీసుకున్నారు.
- వేపాడ మండలం కొండగంగుబూడి పంచాయతీ పరిధిలోని గెడ్డ పొంగడంతో సమీప కాలనీలో చేరిన నీరు ఇంకా వీడలేదు.

ఇవన్నీ మొంథా తుఫాన్ తెచ్చిన కష్టాలు. జిల్లాలో ఎక్కడ చూసిన ఇవే పరిస్థితులు కనిపిస్తున్నాయి. కొండ శిఖర గ్రామాల్లో ఇళ్లల్లోకి నేటికీ నీరు చేరుతోంది. ఊటలు ఇళ్లల్లోకి వచ్చేస్తున్నాయి. ఇళ్లు ఎక్కడ కూలిపోతాయోనని భయపడుతున్నారు. మరోవైపు మైదాన ప్రాంతాల్లో అనేక గ్రామాల్లో (మిగతా 8వ పేజీలో..)

తగ్గని అకులోవ గెడ్డ ఉధృతి

రేగిడి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావానికి ఎగువన కురిసిన వర్షాలతో అకులోవ గెడ్డ గురువారం మరింత ఉధృతమైంది. ఈవరదనీరు సాయన్నగెడ్డలో కలవడంతో ఆరుగ్రామాలు ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగింది. రేగిడిలోని ప్రభుత్వ కార్యాలయాలు జలదిగ్బంధంలో ఉన్నాయి. వెంకమ్మపేట, రేగిడి వెళ్లే కాజ్‌వే మునిగి ఉంది.



రేగిడి రోడ్డు దాటేందుకు అవస్థలు పడుతున్న విద్యార్థినులు, వైద్య సిబ్బంది

స్వర్గధామంపై విచారణ జరిపిస్తాం
• ఎమ్మెల్యే లోకం నాగమాధవి 7

వర్షాల వేళ.. పంటలు కాపాడుకోవాలిలా
• తగిన జాగ్రత్తలతో రైతులకు మేలు 6

6 వదలని గజరాజులు

6 ఢిల్లీ సైన్స్ టూర్‌కు విద్యార్థులు

కూటమి బలోపేతమే లక్ష్యం

- ఎన్‌డీఏ కూటమి నేతలతో సమావేశమైన మంత్రి కొండపల్లి శ్రీనివాస్
- సమన్వయంతో ముందుకు సాగాలని పిలుపు

విజయనగరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కూటమి బలోపేతమే లక్ష్యంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గురువారం తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేలు, కూటమి ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడితో పాటు ఎమ్మెల్యేలు లలితకుమారి, బేబీనాయన, లోకం నాగమాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున, జనసేన నాయకురాలు పాలవలస యశస్విని, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌వర్మ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రామ్‌మల్లిక్ నాయుడు, విజయనగరం నుంచి కార్యాలయ ఇన్‌చార్జి పి.రాజేష్‌వర్మ తదితరులు హాజరయ్యారు. నియోజకవర్గాల వారీగా సమస్యలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. చెప్పిన విషయాలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లనున్నట్టు చెప్పారు. జిల్లా సమగ్ర అభివృద్ధి సంక్షేమం, మౌలిక సదుపాయాల కల్పనపైనా సమగ్రమైన చర్చ జరిగింది. జిల్లా అభివృద్ధికి ఉన్న అవకాశాలు, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలు, భవిష్యత్‌లో (మిగతా 8వ పేజీలో..)



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

నష్టాన్ని సమగ్రంగా నమోదు చేయండి



- వరద బాధితులకు రేషన్ పంపిణీ చేయండి
- సాధారణ స్థితి వచ్చే వరకూ అప్రమత్తం
- కలెక్టర్ రామసుందర్ రెడ్డి

విజయనగరం కలెక్టరేట్/రేగిడి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు, వరదలకు జరిగిన ప్రతి చిన్న నష్టాన్ని కూడా నమోదు చేయాలని కలెక్టర్ రామసుందర్‌రెడ్డి ఆదేశించారు. రహదారులు, విద్యుత్, పంట, పశు నష్టాలతో పాటు ప్రభుత్వ భవనాలైన వసతిగృహాలు, పాఠశాలలు, వైద్య, పశు శాఖల భవనాలకు (మిగతా 8వ పేజీలో..)

రూ.110 కోట్ల నష్టం

- రోడ్ల మరమ్మతులకు రూ.79 కోట్లతో ప్రతిపాదనలు
- 2757 హెక్టార్లలో పంటలకు నష్టం

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో జిల్లాకు భారీ నష్టం వాటిల్లింది. అన్ని శాఖలు కలిపి సుమారు రూ.110.7 కోట్ల వరకూ నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారు. గురువారం నాటికి తుఫాన్ తీవ్రత తగ్గినా ఉదయం భారీ వర్షం కురవడంతో అధికారులు, రైతులు కలవర పడ్డారు. 21 మండలాల్లో 68 గ్రామాలు తుఫాన్ తీవ్రతకు గురయ్యాయి. 90 ఇళ్లు దెబ్బతిన్నాయి. వీటి విలువ రూ.21.36 లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఆరు పశువులు మృతి చెందాయి. 172 గ్రామాల్లో 2297 మంది రైతులకు చెందిన 1603 హెక్టార్లలో (మిగతా 8వ పేజీలో..)

బాధితులకు అండగా.. 7లో
• పునరావాస కేంద్రాల్లో నిత్యావసర సరుకుల పంపిణీ
• పాల్గొన్న ఎమ్మెల్యేలు, అధికారులు

7లో తాగునీటి వనరులపై దృష్టి
• మంత్రి, కలెక్టర్ ఆదేశాలతో కదిలిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు
• రక్షిత నీటి పథకం ట్యాంకుల్లో క్లోరినేషన్

నాణ్యత పరీక్షలు నీటి మూటలేనా?

- సచివాలయాలకే పరిమితమైన కిట్లు
- ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం • పట్టించుకోని ఉన్నతాధికారులు
- వర్షాల నేపథ్యంలో పొంచి ఉన్న వ్యాధుల ముప్పు



నీటి పరీక్షల కిట్

గజపతినగరం, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి):

తాగుతున్న నీరు సురక్షితమేనా? నాణ్యతను నిర్ధారించే పరీక్షలు క్రమం తప్పకుండా చేస్తున్నారా? ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారా? అసలు సచివాలయాల్లో ఉన్న నీటి పరీక్షల కిట్‌ను ఉపయోగిస్తున్నారా? అంటే చాలా గ్రామాల నుంచి లేదని సమాధానం వినిపిస్తోంది. భారీ వర్షాలకు పరిసరాల్లో అనేక మార్పులు వచ్చాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎక్కడికక్కడ నీరు నిల్వ ఉంది. తాగునీటి పైపులైన్లు మునిగి ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో తాగునీటి విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా వ్యాధులు పొంచి ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. ఇలాంటి సమయాల్లో ఉపయోగించాల్సిన తాగునీటి పరీక్షల కిట్‌లు సచివాలయాల్లో ఓ మూలన పడి ఉన్నాయి. అసలు అవి ఎప్పుడూ ఉపయోగించడం చూడలేదని అనేక గ్రామాల ప్రజలు చెబుతున్నారు.

తాగునీటి ద్వారా 80 రకాల వ్యాధులు సోకే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు. వర్షాలు కురిసేటప్పుడు గ్రామాల్లో వనరులన్నీ కలుషితమవుతున్నాయి. అనుమానం ఉన్న చోట్ల నీటి నమూనాలు సేకరించి.. వాటిని పరీక్షించి.. ప్రజారోగ్యాన్ని పరిరక్షించే కట్టుదిట్టమైన వ్యవస్థ ఉన్నప్పటికీ సక్రమంగా అమలు కావడంలేదు. గజపతినగరం నియోజకవర్గంలోని గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి, గంట్యాడ మండలాలకు సంబంధించి 77 సచివాలయాలకు ఒక్కోటి చొప్పున ఫీల్డ్ టెస్ట్ కిట్(ఎఫ్‌టీకే)లను కేంద్ర ప్రభుత్వం ఇచ్చింది. ఒక్కో కిట్ విలువ సుమారు రూ.5వేలు. ఇంజనీరింగ్ సహాయకులు ప్రతి 15 రోజులకు ఒకసారి క్షేత్రస్థాయిలో తాగునీటిని పరీక్షించాలి. సురక్షితమని నిర్ధారించాకే కొళాయిలకు సరఫరా చేయాలి. వర్షాకాలంలో ఈ ప్రక్రియ తప్పకుండా జరగాలి. కానీ జరగడం (మిగతా 8వ పేజీలో..)

● తుఫాన్‌తో అన్నదాత కుదేలు ● పొలాల్లో నిలిచిన నీరు

కోలుకోలేని కష్టం

మొంథా తుఫాన్ ఉమ్మడి జిల్లా రైతులను నిండా ముంచేసింది. నేడో రేపో కోతకు సిద్ధమవుదామనుకున్న తరుణంలో వరి పొలాలను వరద ముంచెత్తింది. పొలాల నుంచి నీరు పోయే మార్గం తెలియక అన్నదాతలు కన్నీరుమున్నీరవుతున్నారు. కొన్నిచోట్ల వరి మొలకలు వచ్చాయి. అనేక గ్రామాల్లో రహదారులు కోతకు గురయ్యాయి. కల్వర్టులు కొట్టుకుపోయాయి. వివిధ ప్రాంతాల్లో చెరువులు, కాలువలకు గండ్లు పూడ్చే పనిలో అధికారులు, స్థానికులు నిమగ్నమయ్యారు.

-ఆంధ్రజ్యోతి బృందం



వెంగళరాయ సాగర్ గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

వేగావతి ఉగ్ర రూపం..

బొబ్బిలి రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పారాది వద్ద ఉన్న వేగావతి నది ఉధృతి తగ్గలేదు. ఎగువన కురిసిన భారీ వర్షాలకు, పెద్దగెడ్డ గేట్లు ఎత్తివేయడంతో గురువారం నది ఉధృతి పెరిగింది. దీంతో పరీవాహక గ్రామాల మధ్య రాకపోకలు స్తంభించాయి. గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వేగావతి నది ఉప్పొంగడంతో ఈ దుస్థితి ఏర్పడింది. పారాది కాజ్‌వే పైనుంచి నీరు ప్రవహించడంతో పాత వంతెన మీద నుంచి బస్సులు, మినీ వాహనాలకు అనుమతి ఇచ్చారు. భారీ వాహనాలను దారి మళ్లించారు. రెండు రాష్ట్రాలను, రెండు జిల్లాలను అనుసంధానం చేసే పారాది బ్రిడ్జి త్వరగా పూర్తి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



దత్తిరాజేరు: గదబవలస వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డ



పారాది వద్ద వేగావతి ఇలా...

కారుతున్న కలెక్టరేట్ భవనాలు..

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిపాలనకు కేంద్ర బిందువైన కలెక్టరేట్ సముదాయంలో ఉన్న భవనాలు వర్షానికి కారిపోతున్నాయి. ప్రధానంగా జేసీ చాంబర్ ముందు, మైనార్టీ కార్యాలయం, సర్వే శాఖ, కేఆర్ఆర్‌సీ కార్యాలయం, ఎస్ఐసీ, ఎక్సైజ్ కార్యాలయాలు తడిసి ముద్దయ్యాయి. జేసీ చాంబర్ వద్ద కారుతున్న వర్షపు నీటిని గురువారం తుడిచే ప్రక్రియ చేపట్టారు. దీంతో సిబ్బంది ఇబ్బంది పడ్డారు. కార్యాలయం మధ్యలో ఉన్న నీరు బయటకు పోవడానికి అవకాశం లేకపోవడంతో చెరువును తలపించింది.



జేసీ చాంబర్ వద్ద వర్షపు నీటిని తుడుస్తున్న దృశ్యం

ఒట్టిగెడ్డలో పెరిగిన నీటి ప్రవాహం..

వీరఘట్టం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం పక్క నుంచి ప్రవహించే ఒట్టిగెడ్డ నీటి ప్రవాహం పెరిగింది. గత నాలుగు రోజుల నుంచి మొంథా తుపాన్ కారణంగా ఎగువ ప్రాంతంలో వర్షాలు కురవడంతో నీటి ప్రవాహం భారీగా పెరిగింది. దీనితో గ్రామస్తులు ఒట్టిగెడ్డ వైపు వెళ్లవద్దని అధికారులు సూచించారు.



ఒట్టిగెడ్డలో ప్రవహిస్తున్న నీరు

వెంగళరాయ సాగర్‌కు వరద..

మక్కువ రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వెంగళరాయసాగర్ జలాశయం గురువారం కూడా వరద తాకిడితో పరవళ్లు తొక్కింది. సువర్ణముఖి స్పిల్ వే క్రస్ట్ గేటు వద్ద 161 మీటర్ల నిల్వ సామర్థ్యం కాగా.. అంతకు మించి వరదనీరు వచ్చి చేరింది. దీంతో అధికారులు సువర్ణముఖి పరిదిలోని నాలుగు గేట్లు ఎత్తివేసి 1000 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడిచిపెట్టారు. రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి గురువారం ప్రాజెక్టును సందర్శించి నాలుగు గేట్ల ద్వారా నదిలోకి నీరు విడుదల చేయడాన్ని పరిశీలించారు.



భామిని: నులకజోడులో మొక్కజొన్నపై కప్పిన టార్పాలిన్లు



భామిని: లివిరిలో మొలకలు ఏరుతున్న రైతులు



రాజాం: వీఆర్ అగ్రహారం ప్రాంతంలో నీట మునిగిన వరి



ఎస్.కోట: ఏవో రవీంద్రకు సమస్యలు చెబుతున్న రైతులు



చీపురుపల్లి: మెట్టపల్లిలో వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు



గజపతినగరం: శ్రీరంగరాజపురంలో పత్తి పొలంలో నిలిచిన నీరు



బొండపల్లి: కనిమెరకలో కోతకు గురైన రహదారి

వదలని గజరాజులు

జియ్యమ్మవలస, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గవరమ్మపేట- చింతలబెలగాం గ్రామాల మధ్య వరి, అరటి తోటల్లో ఏనుగులు తిష్ట వేశాయి. బుధవారం గవరమ్మపేట, ఎరుకులపేట, వెంకటరాజపురం గ్రామాల మధ్య సంచరించిన ఏనుగులు గురువారం గవరమ్మపేట, చింతలబెలగాం గ్రామాల మధ్య పొలాల్లో తిరిగాయి. దీంతో అరటి, వరి పంటలకు నష్టం వాటిల్లిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏనుగులను వెంటనే ఈ ప్రాంతం నుంచి తరలించాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.



చింతలబెలగాం వైపు వెళుతున్న గజరాజులు

అయ్యప్ప స్వామికి భస్మాభిషేకం

సాలూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో గురువారం స్వామి వారికి సుమారు 400 కేజీల భస్మంతో భస్మాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో సాలూరుతోపాటు పరిసర గ్రామాలకు చెందిన అనేక మంది అయ్యప్ప, శివ స్వాములు పాల్గొన్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.



అయ్యప్పస్వామికి భస్మాభిషేకం చేస్తున్న విజయ్ గురుస్వామి

ఢిల్లీ సైన్స్ టూర్‌కు విద్యార్థులు

పాలకొండ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు మంచి అవకాశాన్ని కల్పించింది. ప్రతి జిల్లా నుంచి ఇద్దరు చొప్పున మొత్తం 52 మంది విద్యార్థులకు ఢిల్లీలో ఇస్రో నిర్వహిస్తున్న స్పేస్ వర్క్‌షాప్‌నకు హాజరవుతున్నారు. సమగ్ర శిక్ష, సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొనాలని రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు. పార్వతీపురంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి పదో తరగతి చదువుతున్న ఎ.రోహిత్, భామిని ఏపీ మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న సాహుకారు నిహారిక ఎంపికయ్యారు.



ఎ.రోహిత్



ఎస్.నిహారిక

జిల్లాకు గర్వకారణం..

ఢిల్లీ సైన్స్‌టూర్‌కు జిల్లా నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపిక కావడం గర్వకారణం. ఇటువంటి సైన్స్ టూర్‌లు విద్యార్థులను అత్యున్నత స్థాయికి తీసుకెళ్లడానికి మార్గం చూపిస్తాయి.

-బి.రాజ్‌కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి

వర్షాల వేళ.. పంటలు కాపాడుకోవాలిలా

● తగిన జాగ్రత్తలతో రైతుకు మేలు

విజయనగరం రూరల్/కురుపాం రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ పభావంతో రెండు రోజులుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం కూడా వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. ఖరీఫ్‌నకు సంబంధించి జిల్లాలో వరి, మొక్కజొన్న, పత్తి, చెరకు తదితర పంటలు ఉన్నాయి. వీటిని సంరక్షించుకోకపోతేరైతులు భారీగా నష్టపోయే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో వివిధ పంటలను రక్షించుకునే విధానాలను వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు చెబుతున్నారు.

వరి సంరక్షణ ఇలా..

విజయనగరం జిల్లాలో ప్రస్తుతం రెండుదశల్లో వరి ఉంది. తొలి దశలో వరి పూత, పాలు పోసుకునే దశ, గింజ గట్టిపడే స్థితిలో ఉండేది. మరోవైపు వరి పొట్ట నుంచి వెన్ను బయటకు వచ్చే దశలో చేలు ఉన్నాయి.

● స్వర్ణ, బీపీటీ 5204 రకాలు పూతదశలో వర్షాలు కురిస్తే, తాలు ఏర్పడతాయి.

● బ్యాక్టీరియా, ఎండాకు మాగుడు తెగుళ్లు వ్యాపించే ప్రమాదం ఉంది.

● బీపీటీ 5204 వంటి నిద్రావస్థ లేని రకాలలో గింజలు వెంటనే మొలకెత్తే అవకాశం ఉంది.

● పాలు పోసుకునే దశలో ఉన్న వాటికి పొలంలో నీటిని అంతర్గత కాలువల ద్వారా బయటకు పంపించాలి.

● ఎక్కువగా నీరు నిలిచే చోట పెద్ద కాలువలుగా చేసి మోటార్ల ద్వారా తోడించాలి.

● గింజ రంగు మారకుండా మాగుడు, మానిపండు తెగుళ్ల నిరోధానికి ఎకరాకు 200 మిల్లీలీటర్ల చొప్పున ప్రోపికోనాజోల్ చల్లాలి.

● గింజ గట్టిపడే దశలో ఉంటే పొలంలో నీటిని అంతర్గత కాలువల ద్వారా తొలగించాలి. నిలిచిన లేదా పడిపోయిన పంటల్లో కంకిలో మొలకలు కనబడితే, 5 శాతం ఉప్పు ద్రావణం, (50 గ్రాముల స్ఫటిక ఉప్పను లీటరు నీటికి) చల్లాలి. ఇది మొలకల రంగు మార్పును తగ్గిస్తుంది.

తెగుళ్ల నియంత్రణకు..

● ఎండాకు తెగులు కనిపిస్తే ప్లాంటోమైసిన్ 1 మిల్లీ లీటరు ప్లస్ కోసైడ్ (కాపర్ ఆక్సీక్లోరైడ్) 2 గ్రాములను లీటరు నీటిలో కలిపి చల్లాలి.

● నీరు తగ్గిన తరువాత హెక్సాకోనాజోల్ ఎకరాకు 400 మిల్లీ లీటర్లు లేదా ప్రోపి కోనా జోల్ 200 మిల్లీలీటరు చల్లాలి.



వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

పత్తిలో..

● పత్తి పంటలో ప్రతి పది వరుసలకు ఒక లోతు కాలువ ఏర్పాటు చేసుకుని వర్షపు నీటిని బయటకు పంపే ఏర్పాట్లు చేయాలి.

● 3 గ్రాముల కాపరాక్సీ క్లోరైడ్‌ను లీటరు నీటిలో కలిపి ఆకులు, కాయలు, మొక్క మొదళ్ల బాగా తడిచేలా పిచికారీ చేయాలి.

● పంటకు అదనంగా 30 కిలోల యూరియా, 15 కిలోల మ్యూరేట్, మెగ్నిషీయం సల్ఫేటు, 10 గ్రాముల పొటాష్ వేయాలి.

● పొటాషియం నైట్రేటు 10 గ్రాములు, మెగ్నిషీయం సల్ఫేటు 10 గ్రాములను తీసుకుని 200 లీటర్ల మందు ద్రావణాన్ని పిచికారీ చేయాలి.

● పత్తిలో పిండినల్లి నివారణకు లీటరు నీటికి 2 మిల్లీలీటర్ల ప్రొపినోపాస్ మందును పిచికారీ చేయాలి.

● వర్షాలు తగ్గిన 3 లేదా 4 రోజుల తరువాత వరుసల మధ్యభాగాన్ని గుంటకతో కాని, గొప్పు ద్వారా కానీ పిచికారీ చేయాలి.

మొక్కజొన్నలో..

● పొలంలో ముంపు నీటిని వీలైనంత త్వరగా బయటకు పంపడానికి ఏర్పాట్లు చేయాలి. ప్రతి పది వరుసలకి లోతు కాలువను ఏర్పాటు చేసుకుని బయటకు పంపించాలి.

● ఎకరానికి 50 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ ఎరువులను వేయాలి.

● మొక్కజొన్నలో ఆకు తెగులు నివారణకు ఎకరానికి ప్రొపికోనజోల్ 200 మిల్లీలీటర్లు, 200 లీటర్లతో కలిపి పిచికారి చేయాలి.

● వర్షాలు తగ్గిన 3-4 రోజులు తరువాత వరుసల మధ్యభాగాన్ని గుంటకతో గాని గొప్పుద్వారా కాని సేద్యం చేయాలి.

కంది పంటలో..

● పొలంలో ఉన్న ముంపు నీటిని తక్షణమే బయటకు పంపే ఏర్పాట్లు చేయాలి.

● ఎకరానికి 10 నుంచి 15 కిలోల యూరియాను పిచికారీ చేయాలి.

● వడల తెగుళ్లు, రసం పీల్చే పురుగు నివారణకు 400 మీల్లీలీటర్ల పిప్రోనిల్, ప్రోపికోనజోల్ 200 మిల్లీ లీటర్లు, 200 లీటర్ల నీటికి కలిపి చేను బాగా తడిసేలా పిచికారీ చేయాలి.

చెరకులో..

● ముందుగా చెరకు పంట పొలంలో లోతట్టు ప్రాంతంలో నిలిచిన నీటిని యాంత్రిక కప్పీలు లేదా మోటారు పంపులు, ఏతలు లేదా గూడల ద్వాంతక్షణమే బయటకు పంపాలి.

● గాలి వేగం గంటకి 50 నుంచి 60 కి.మీ. మించి ఉంటే... చెరకు తోటలు పడిపోయే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో జడలు చుట్టుకుని వాటిని పడకుండా చూసుకోవాలి.

● ముంపునకు గురైన చేరకు తోటలలో తెల్లదోమ, దూదేకుల పురుగు, పిండి నల్లి, ఉలి ఎపిడ్ కీటకాల నాశినికి లీటరు నీటికి మాలాథియాన్ 2 మీల్లీలీటర్లు లేదా ఎసిసెట్ 1.5 గ్రాములు కలిపి పంటపై పిచికారీ చేయాలి.



కురుపాం రూరల్: నేలకొరిగిన బొప్పాయి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

అరటిలో ఇలా..

అయిదారుల నెలల వయస్సు ఉండి... గెలలు వేసే దశలో ఉన్న మొక్కలు 5 రోజులు దాటి నీట మునిగితే వేరు వ్యవస్థ పూర్తిగా కుళ్లిపోయి బతకడం కష్టం. 5 రోజుల కన్నా తక్కువ ముంపులో ఉంటే నీటిని బయటకు తీయాలి. మొక్క ఒక్కింటికి 100 గ్రాముల యూరియా, 80 గ్రాముల పొటాష్‌ను 20-25 రోజుల వ్యవధిలో 2 లేదా 3 దఫాలుగా వేయాలి. ఆకులు తడిసేలా 5 గ్రాముల పొటాషియం నైట్రేట్‌ను ఒక లీటరు నీటికి తగినంత జిగురు కలిపి వారం రోజుల వ్యవధిలో మూడుసార్లు పిచికారీ చేయాలి. పూర్తిగా గెలలు విడిచి నీట మునిగిన అరటి చేలలో నీటిని పూర్తిగా తీసివేసి లీటరు నీటికి 5 గ్రాముల సల్ఫేట్ ఆఫ్ పొటాష్ (0.0.52) మరియు 5 గ్రాముల పొటాషియం నైట్రేటు (13.0.45) ఎరువును వెను వెంటనే 3 రోజుల వ్యవధిలో మూడుసార్లు పిచికారీ చేయాలి. గెలలు ఎండిన అరటి ఆకులతో కప్పి ఉంచి 15 రోజుల్లో మార్కెట్ చేసుకోవాలి.

సూచనలు పాటించండి..



వ్యవసాయశాఖాధికారులు, శాస్త్రవేత్తల సూచనలను రైతులు పాటించాలి. వరి, మొక్కజొన్న, చెరకు, కంది ఇతర పంటలు ఏవైనా సరే. పొలంలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలి. ఆ నీటిని బయటకు పంపే మార్గం చూడాలి. ఈ విధంగా చేయడం వల్ల పంటకు మేలు జరుగుతుంది. వర్షాలు పడినప్పుడు తెగుళ్లు వచ్చే అవకాశం ఉంది. దానికి వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సలహాలు తీసుకుని తగిన విధంగా మందును పిచికారీ చేస్తే, తెగుళ్ల నాశనమవుతాయి.

-కె.లక్ష్మణరావు, ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్, వ్యవసాయ శాస్త్రవేత్త

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం..



తుపాను ప్రభావంతో నష్టపోకుండా శాస్త్రవేత్తలమంతా పొలాలకు వెళ్లి రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల నష్టం కొంతమేర తగ్గించుకునే అవకాశం ఉంది. ఏమైనా అధిక వర్షాలు, ముంపు వల్ల రైతులకు పూర్తి ఫలసాయం రావడం కష్టమే. సకాలంలో సరియైన యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల నష్టం శాతాన్ని తగ్గించవచ్చు.

-డాక్టర్ ఎస్.ధ్రువ, కేవీకే చీఫ్, రస్తాకుంటుబాయి

ముందస్తు చర్యలే రక్షణగా నిలిచాయి

● ఎంపీ కలిశెట్టి



విజయనగరం రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు మొంథా తుఫాన్ విషయంలో తీసుకున్న ముందస్తు చర్యలే రక్షణ చర్యలుగా నిలిచాయని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. అనుభవజ్ఞులు ఉంటే ఇటువంటి విపత్కర పరిస్థితులను సునాయాసంగా ఎలా ఎదుర్కొవచ్చునో ఈ సహాయక చర్యలే నిదర్శనమన్నారు. పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగారన్నారు.

ఎర్రిగెడ్డకు గండి

మెంటాడ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పులిగుమ్మి ప్రాంతంలో ఎర్రిగెడ్డకు గురువారం గండి పడింది. కొన్ని నెలల కిందట కురిసిన వర్షాలకు గండి పడటంతో ఇసుక బస్తాలతో రైతులు గండిని పూడ్చారు. ఇటీవల కురిసిన వర్షాలకు మళ్లీ గండి పడింది.

మెనూ సక్రమంగా అమలు చేయాలి

రాజాం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మెనూ సక్రమంగా అమలు చేయాలని డీఐఈవో ఎస్.తవిటినాయుడు ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను ఆయన గురువారం సందర్శించారు. భోజన పథకాన్ని పరిశీలించి, పలు సూచనలు చేశారు. రికార్డులను తనిఖీ చేశారు.

విద్యతోనే మహిళా సాధికారత

సంతకవిటి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): విద్యతోనే మహిళా సాధికారత సాధించాలని రోటేరియన్ ఆప్తాల్మిక్ ఆఫీసర్ సప్పటి వసంతరావు అన్నారు. గురువారం వాసుదేవపట్నం కేజీబీవీలోని బాలికలకు జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో నేత్ర పరీక్షలు నిర్వహించారు. దృష్టి సమస్య ఉన్న ఐదుగురికి కళ్లద్దాలు సిఫారసు చేశారు.

సిలబస్‌ను పూర్తి చేయాలి

శృంగవరపుకోట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట ప్రభుత్వ ఉన్నత పాఠశాలను డీఈవో మాణిక్యంనాయుడు గురువారం సందర్శించారు. ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరుపట్టీని పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులను దత్తత తీసుకుని చదవించాలని సూచించారు. నవంబరు నెల లోపు సిలబస్‌ను పూర్తి చేయాలని ఆదేశించారు.

బీజేపీతోనే అభివృద్ధి

నెల్లిమర్ల, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మైపాడ ప్రసాద్ అన్నారు. మండలానికి చెందిన పలువురు వైసీపీ నుంచి బీజేపీలో చేరారు. వీరిని మైపాడ ప్రసాద్, మహేశ్వరీ దంపతులు గురువారం మైపాడలోని తన స్వగృహం వద్ద జరిగిన కార్యక్రమంలో పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీ ప్రధాన కార్యదర్శి చందక గోవింద్, ఆల్తి నల్లిబాబు, చందక రమణ పాల్గొన్నారు.

డ్రోన్లతో పర్యవేక్షణ

ఎస్.కోట రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా జరిగే నష్టాలను అంచనా వేసేందుకు మండలంలోని గిరిశిఖర గ్రామాలను సీఐ నారాయణమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు డ్రోన్లతో పర్యవేక్షించారు. దారపర్తి పంచాయతీలోని గ్రామాలపై గురువారం డ్రోన్లు ఎగురవేశారు. సీఐ ఆయా గ్రామాల్లో పర్యటించి గిరిజనుల కష్ట సుఖాలను అడిగి తెలుసుకున్నారు.

రహదారి భద్రత పాటించాలి

గంట్యాడ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ రహదారి భద్రతను పాటించాలని డీఎస్పీ గోవిందరావు సూచించారు. మండలంలోని వివిధ గెడ్డలను ఆయన గురువారం పరిశీలించారు. అనంతరం కొటారుబిల్లి కూడలిలో ఆటో డ్రైవర్లకు పలు సూచనలు ఇచ్చారు. రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. అజాగ్రత్తగా వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీఐ లక్ష్మణరావు, ఎస్ఐ సాయికృష్ణ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

చీపురుపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా వైద్య ఆరోగ్య, పంచాయతీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డివిజనల్ అభివృద్ధి అధికారి, మండల ప్రత్యేకాధికారి హేమసుందరరావు ఆదేశించారు. గురువారం ఆయన కర్లాం, మెట్టపల్లి గ్రామాల్లో పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు. ఉచిత వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఆయన వెంట వైద్య ఆరోగ్య సిబ్బంది, సచివా లయ సిబ్బంది ఉన్నారు.

రేపు చెకుముకి పరీక్ష

చీపురుపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): చెకుముకి మండల స్థాయి పరీక్ష నవంబరు 1న నిర్వహించనున్నట్టు జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు వావిలపల్లి మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలల స్థాయిలో జరిగిన చెకుముకి పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులను ఈ పరీక్షకు హాజరు పరచాలని ఆయన కోరారు. చీపురుపల్లి మండల విద్యా వనరుల కేంద్రంలో ఉదయం 10 నుంచి 11 వరకూ ఈ పరీక్ష జరుగుతుందన్నారు.

టైప్‌రైటింగ్ పరీక్షలు

విజయనగరం రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): టైప్‌రైటింగ్, షార్ట్ హాండ్ రైటింగ్ పరీక్షలు జనవరి 24, 25న విజయనగరంలోని అంబటిసత్తర్వు జంక్షన్‌లో ఉన్న రామా టైప్ ఇనిస్టిట్యూట్‌లో నిర్వహించనున్నట్టు ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపాల్ యువీ అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు సమీపంలోని టైపింగ్ ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపాల్స్‌ని సంప్రదించాలని కోరారు.

తాగునీటి వనరులపై దృష్టి

● మంత్రి, కలెక్టర్ ఆదేశాలతో కదిలిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

విజయనగరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో రోగాలు ప్రబలకుండా జిల్లా వ్యాప్తంగా రక్షిత తాగునీటి పథకాల ట్యాంకులను శుభ్రపరచాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి ఆదేశించారు. వారి ఆదేశాలతో గ్రామీణ నీటి సరఫరా విభాగం ప్రత్యేక దృష్టి సారించింది. దీంతో క్షేత్రస్థాయి నుంచి నివేదికలు తెప్పించుకున్న గ్రామీణ నీటి సరఫరా విభాగం ఉన్నతాధికారులు ప్రక్షాళన చర్యలకు శ్రీకారం చుట్టారు. తక్షణమే అన్ని రక్షిత తాగునీటి పథకాలు, ట్యాంకర్లలో తగిన మోతాదులో క్లోరినేషన్ చేయాలని నిర్ణయించారు. నదీతీర ప్రాంతాల్లో ఉన్న గ్రామాలకు నీటిని అందించే ఇన్‌ఫిల్టర్ బావుల వద్ద వరదనీరు చేరింది. అలాంటి చోట్ల నీటిని వాటర్ ట్యాంకులకు లిఫ్ట్ చేయొద్దని అధికారులకు సూచించారు.

విజయనగరం జిల్లా పరిధిలోని 777 గ్రామాలు ఉండగా.. వీటిలో నివసించే ప్రజలకు నీటి సరఫరా కోసం 150 బావులు, 30 రక్షిత తాగునీటి పథకాలు, 15,800 చేతిబోర్లు ఉన్నాయి. అయితే నదీ పరివాహక ప్రాంతాల్లో ఉన్న 7 రక్షిత తాగునీటి బావులు, పథకాలు ప్రస్తుతం వరదనీటిలో ఉన్నాయి. వీటి పరిధిలో ఉన్న 150 గ్రామాలకు తాగునీటి సరఫరా ప్రశ్నార్థకంగా



చంపావతి ఒడ్డున ఉన్న ఇన్‌ఫిల్టర్ బావిని పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

మారింది. ఈ నేపథ్యంలో మంత్రి, కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఈ 150 గ్రామాల ప్రజలకు ట్యాంకర్ల ద్వారా సురక్షితమైన తాగునీరును అందిస్తున్నారు. ప్రస్తుతం ఆయా పథకాల పరిధిలో తాగునీరు సరఫరా అయ్యే పైపులైన్లలో మట్టి, బురదను తొలగించే కార్యక్రమం జరుగుతుంది. అదే విధంగా రక్షిత తాగునీటి పథకాలు, బావులు, బోర్ల వద్ద ప్రత్యేకంగా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో చేరిన బురదను తొలగించి, బ్లీచింగ్ పౌడర్ వేయడంతో పాటు ఆయా ట్యాంకులను కూడా యుద్ధ ప్రాతిపదికన శుభ్రం చేయాలని నిర్ణయించారు. ఈ ప్రక్రియ అంతా పూర్తయ్యేసరికి వారం రోజులు పట్టే అవకాశం ఉంది. గోస్తనీ నది పరివాహక ప్రాంతం పరిధిలో దాదాపు మూడు గ్రామాల్లో కూడా ఇదే విధమైన చర్యలు చేపడుతున్నారు. ముఖ్యంగా బురదనీరు రాకుండా తగిన చర్యలు చేపడుతున్నారు.

కాచి చల్లార్చిన నీరు తాగాలి

తుఫాన్ కారణంగా జిల్లాలోని ప్రజలు కాచి చల్లార్చిన నీరు తాగాలి. ఎక్కడైతే, బావులు, తాగునీటి పథకాలు తదితర వాటి వద్ద బురద వచ్చిందో.. ఆ ప్రాంత ప్రజలకు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని మంత్రి శ్రీనివాస్, కలెక్టర్ రామసుందర్ రెడ్డి ఆదేశించారు. వారి ఆదేశానుసారం జిల్లాలోని 150 గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నాం. మరో వైపు బావులు, రక్షిత తాగునీటి పథకాలు, చేతిబోర్లు వద్ద శుభ్రం చేసి, క్లోరినేషన్ చేస్తున్నాం. ఈ ప్రక్రియను వీలైనంత వేగంగా ముగిస్తాం.

- కవిత, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ, విజయనగరం

ప్రతిరైతుకూ న్యాయం చేస్తాం

వంగర, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామని రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ తెలిపారు. కొండచాకరాపల్లి, కొప్పర గ్రామాల్లో ఆయన గురువారం పర్యటించారు. వరదల వల్ల నష్టపోయిన పంటలను పరిశీలించారు. అలాగే ఇటీవల కొండచాకరాపల్లిలో విద్యుత్ షాక్‌తో మృతిచెందిన పారిశర్ల వెంకటరమణ



భోగాపురం: నీట మునిగిన పంటను పరిశీలిస్తున్న మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు

కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు ఉన్నారు.

● రేగిడి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో రైతులకు జరిగిన పంట నష్టం వివరాలు కచ్చితంగా ఉండాలని ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్ వ్యవసాయశాఖ సిబ్బందికి ఆదేశించారు. పాతచెలిగానవలస, కందిశ గ్రామాల్లో ఆయన గురువారం పర్యటించారు. పలు ప్రాంతాలకు ఆయన ద్విచక్రవాహనం వెనుక కూర్చొని వెళ్లడం కనిపించింది.

● రాజాం: తుఫాన్ కారణంగా నష్టపో యిన రైతులను ఆదుకుంటా మని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో పునరావాసం ఉంటున్న వారికి ఆయన నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

● భోగాపురం: మొంథా తుఫాన్ కారణంగా పంట



వంగర: ట్రాక్టర్‌పై పంట పొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోండ్రు

నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని మార్క్‌ఫెడ్ చైర్మన్, టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. నందిగాం పరిసర ప్రాంతంలో ఆయన గురువారం పర్యటించారు. ఈసందర్భంగా నీట మునిగిన వరి పంటను పరిశీలించారు. అలాగే చంపావతి నది ప్రవాహం కారణంగా గ్రామ సమీపంలో కోతకు గురైన ప్రాంతాన్ని పరిశీలించారు. టీడీపీ మండల అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ, అధికారులు ఉన్నారు.

బాధితులకు అండగా..

● పునరావాస కేంద్రాల్లో నిత్యావసర సరుకుల పంపిణీ

● పాల్గొన్న ఎమ్మెల్యేలు, అధికారులు

డెంకాడ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): బంటుపల్లి, పేడాడ, రఘుమండ గ్రామాల్లో పునరావాస కేంద్రంలో ఉన్న బాధితులకు ఎమ్మెల్యే లోకం నాగమాధవి, మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖరరావు గురువారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, టీడీపీ నేత కలిదిండి పాణిరాజు, యూనిట్ ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు. ● ఎస్.కోట రూరల్: వర్షాలకు ఇబ్బంది పడుతున్న మూలబొడ్డవర, దారపర్తి పంచాయతీల గిరిశిఖర గ్రామాల కుటుంబాలకు బొడ్డవర ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం ఇందుకూరి అశోక్‌రాజు ఆదుకున్నారు. సుమారు 370మందికి ఆయన సమకూర్చిన నిత్యావసర సరుకులను డీఈవో మాణిక్యంనాయుడు, పీఆర్టీయూ నేతలు గురువారం పంపిణీ చేశారు. ఎంఈవో నర్సింగరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ● గుర్ల: ఆపదలో ఉన్నవారిని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు అన్నారు. గురువారం ఆయన కోటగండ్రేడు గ్రామాన్ని సందర్శించి, నిరుపేదల చేనేత కుటుంబాలకు నిత్యావ సర సరుకులు పంపిణీ చేశారు. పాలవలసలో బొప్పా యి



డెంకాడ: నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి

పంట నష్టపోయిన రైతులను పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి సన్యాసినాయుడు తదితరులు ఉన్నారు. ● లక్కవరపుకోట: మొంథా తుఫాన్ కారణంగా పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్నవారికి ఎమ్మెల్యే లలితకుమారి గురువారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు ఉన్నారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు. ● ఎస్.కోట రూరల్: పోతనాపల్లి పునరావాస కేంద్రంలో ఉన్న బాధితులకు ఎమ్మెల్యే కోళ్ల లలితకు మారి గురువారం నిత్యావసరాలు అందించారు. ● దత్తిరాజేరు: దత్తి గ్రామంలోని పునరావాస కేంద్రంలో ఉన్న 33 కుటుంబాలకు, అలాగే కృష్ణాపురంలో 14 కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా నిత్యావస సరుకులను అందజేశారు. తహసీల్దార్ హరికిరణ్‌తోపాటు టీడీపీ మండల అధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు. ● ఎస్.కోట రూరల్: మూలబొడ్డవర, దారపర్తి పంచాయతీల్లోని 150 గిరిజన కుటుంబాలకు డీసీఎంఎస్ చైర్మన్



ఎల్.కోట: నిత్యావసర సరుకులు అందిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

గొంప కృష్ణ ఆదేశాల మేరకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్ గురువారం దబ్బగుంట గ్రామం వద్ద నిత్యావసరాలను అందిం చారు. కృష్ణమహంతిపురం పీఏసీఎస్ అధ్యక్షుడు మేడపురెడ్డి శ్రీను, టీడీపీ మండల కార్యదర్శి జుత్తాడ రామసత్యం, వినాయకపల్లి సర్పంచ్ సన్యాసినాయుడు పాల్గొన్నారు. ● విజయనగరం రూరల్: పునరావాస కేంద్రాల్లో ఉన్నవారికి ప్రభుత్వం తరపున నిత్యావసర వస్తువులతో పాటురూ.వెయ్యి చొప్పున గురువారం అందజేశారు. తహసీల్దార్ కూర్మానాథరావు, టీడీపీ నాయకులు పూసపాటి రాజేష్ వర్మ, గంటా రవి, గంటా పోలినాయుడు, ప్రసాదుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ● విజయనగరం రూరల్: కలెక్టర్ రామసుందర్ రెడ్డి ఆదేశాలతో విజయనగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి, అధికారులు, సిబ్బంది తమ మార్కెట్ పరిధిలోని పలు షాపుల యాజమానుల వద్దకు వెళ్లి ఉల్లిపాయలు, బంగాళదుంపలను సేకరించారు. ఈవిధంగా సమకూరిన 300 కిలోల ఉల్లిపాయలు, బంగాళదుంపలను ఏఎంసీ చైర్మన్ కర్రోతు నర్సింగరావు పౌరసరఫరాల శాఖ గోదాలకు అందించారు. ● మెరకముడిదాం: భైరిపురం పునరావాస కేంద్రంలో బాధితులకు తహసీల్దార్ ఆకుల సులోచనరాణి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు తాడ్డి శ్రీధర్, కెంగువ ధనంజయ, కెంగువ నరసింహమూర్తి పాల్గొన్నారు. ● శృంగవరపుకోట: మండల పరిధిలోని పునరావాస కేంద్రాల్లో 85 కుటుంబాలకు ఆశ్రయం కల్పించామని తహసీల్దార్ డి.శ్రీనివాసరావు, డీటీ రంజిత్ తెలిపారు. వీరికి 25 కిలోల చొప్పున బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు అందిస్తున్నామన్నారు.



ఎస్.కోట రూరల్: నిత్యావసర సరుకులు అందిస్తున్న డీఈవో మాణిక్యంనాయుడు



గుర్ల: కోటగండ్రేడులో నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న టీడీపీ నేత రామ్‌మల్లిక్‌నాయుడు

దెబ్బతిన్న రోడ్లు



ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో రోడ్డు ఇలా..

శృంగవరపుకోట, అక్టోబరు 30(ఆంధ్ర జ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో పడిన వర్షాలకు రోడ్లు పాడయ్యాయి. పట్టణ పరిధిలోని విశాఖ-అరకు రోడ్డులో అక్కడక్కడ గుంతలు పడ్డాయి. ఆకుల డిపో నుంచి పోలీస్‌స్టేషన్ మధ్య పలు చోట్ల రోడ్డు గుంతమయంగా తయారయ్యింది.

గత పాలకుల నిర్లక్ష్యం వల్లే..



భీమసింగి ప్రధాన రహదారిపై వరదనీరు(ఫైల్)

జామి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని గత పాలకులు, అధికారుల నిర్లక్ష్యం తమకు శాపంగా మారిందని భీమసింగి వాసులు వాపోతున్నారు. గురువారం వారు మాట్లాడుతూ గతంలో ఎన్నడు లేనివిధంగా చెరువు పొంగి ప్రధాన రహదారితో పాటు పంట పొలాలను వర్షపునీరు ముంచేసి తమకు నష్టం మిగిల్చిందన్నారు. గ్రామాన్ని ఆనుకుని ఉన్న చెరువు ఆక్రమణే దీనికి ప్రధాన కారణమన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

స్వర్గధామం నిర్మాణంపై విచారణ జరిపిస్తాం

● ఎమ్మెల్యే నాగమాధవి

పూసపాటిరేగ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రెల్లివలసలో రూ.60.57లక్షల మండల పరిషత్ నిధులతో నిర్మించిన స్వర్గధామం నిధులు పక్కదారి పట్టాయని ఎమ్మెల్యే లోకం నాగమాధవి గురువారం ఆమె ప్రకటనలో ఆరోపించారు. వైసీపీ మండల నాయకుడు పతివాడ అప్పలనాయుడు స్వగ్రామం కావటంతో ఈ స్వర్గధామానికి ఇంత పెద్దఎత్తున నిధులు వెచ్చించారని కూటమి నాయకులు ఇటీవల ఎమ్మెల్యేకు ఫిర్యాదు అందజేశారు. దీనిపై ఆమె స్పందించి.. విచారణ నిర్వహించే వరకూ ప్రారంభోత్సవాన్ని నిలుపుదల చేయాలని అధికారులకు సూచించారు. కానీ అధికారులు గురువారం జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుతో ఈ స్వర్గధామాన్ని ప్రారంభింపజేశారు. ఈమేరకు ఎమ్మెల్యే ప్రకటన విడుదల చేశారు. సుమరు రూ.10లక్షల అంచనా వ్యయంతో నిర్మించాల్సిన స్వర్గధామానికి ఇంత పెద్దఎత్తున నిధులు ఎలా మంజూరు చేశారని ఆమె ఆ ప్రకటనలో మండిపడ్డారు. ఇటువంటి అక్రమాలు జరిగిన చోట తన పేరును శిలాఫలకంపై తొలగించాలని కోరారు. ఈ నిధుల దుర్వినియోగంపై పైస్థాయికి తీసుకువెళ్లి పూర్తి స్థాయి విచారణ జరిపిస్తామని ఆమె ఆ ప్రకటనలో తెలిపారు.

అర్ధాంతరంగా ముగిసిన సర్వసభ్య సమావేశం

● నిరసన తెలిపిన పలు గ్రామాల సర్పంచ్‌లు

పూసపాటిరేగ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ మహంతి కల్యాణి ఆధ్వర్యంలో గురువారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం అర్ధాంతరంగా ముగిసింది. సమావేశంలో పేరాపురం ఎంపీటీసీ పతివాడ తమ్మినాయుడు మాట్లాడుతూ కొవ్వాడలో గల శ్మశానవాటికను ఎలా తొలగించారంటూ అధికారులను ప్రశ్నించగా.. ఏపీవో స్పందిస్తూ దీనిపై గ్రామసభలు నిర్వహించామని, నివేదికలు పైకి పంపించామని.. విచారణ జరుగుతోందన్నారు. దీనిపై వైసీపీ మండల అధ్యక్షుడు, పతివాడ ఎంపీటీసీ పతివాడ అప్పలనాయుడు కలుగజేసుకుని ఈ విధంగానేనా అధికారులు సమాధానం ఇచ్చేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కొవ్వాడఅగ్రహారానికి చెందిన సర్పంచ్ కోట్ల రఘు మాట్లాడుతూ ఈ విషయమై ప్రతిసారి తనపై బురదజల్లేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. దీంతో సభలో గందరగోళ పరిస్థితి నెలకొంది. కోట్ల రఘును సమాధానం ఇవ్వనివ్వకుండా వైసీపీ నాయకులు అడ్డుపడ్డారు. దీంతో ఆయన ఈ స



సమావేశంలో సభ్యుల వాగ్వాదం

భను సక్రమంగా నడపకుంటే ఎలా అంటూ అసహనం వ్యక్తంచేస్తూ మైక్‌ను విసిరివేశారు. దీంతో మరింత గందరగోళ పరిస్థితి నెలకొనటంతో సభను ఎంపీపీ అర్ధాంతరంగా నిలిపివేశారు. దీనిపై వెంపడాం, కొవ్వాడ అగ్రహారం, కందివలస పంచాయతీలకు చెందిన సర్పంచ్‌లు అక్కడే కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈవోపీఆర్డీ జ్ఞానేశ్వరరావు, సూపరింటెండెంట్ శ్రీనివాసరావులు వచ్చి వీరికి నచ్చచెప్పటంతో అక్కడి నుంచి నిష్క్రమించారు.

విద్యుదాఘాతంతో రెండు ఆవుల మృతి

మెరకముడిదాం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తకర్ర గ్రామంలో సబ్బి పైడితల్లికి చెందిన రెండు ఆవులు గర్భాం రెవెన్యూ పరిధిలో ఉన్న భూమిలో మేతకు వెళ్లి విద్యుత్ వైర్లు తగలడంతో షాక్‌కు గురై మృతిచెందాయి. విద్యుత్ సిబ్బంది అప్రమత్తమై విద్యుత్ సరఫరా నిలుపుదల చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. తహసీల్దార్ ఆకుల సులోచనరాణి, పశు వైద్య, విద్యుత్ సిబ్బంది, స్థానిక నాయకులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

పోలీసులకు యువకుల అప్పగింత

గుమ్మలక్ష్మీపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గద్రజోల గ్రామంలో గురువారం ఉదయం సెల్‌ఫోన్లు దొంగతనం చేస్తుండగా ఇద్దరి యువకులను గ్రామస్థులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. తొలుత దొంగలను పట్టుకున్న సమాచారాన్ని ఎల్విన్‌పేట పోలీసులకు తెలియజేశారు. ఆ గ్రామానికి వెళ్లి పట్టుబడిన యువకులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ బి.శివప్రసాద్ మాట్లాడుతూ పట్టుబడిన యువకులు నుంచి మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నామని, కేసు నమోదు చేశామని చెప్పారు.

అక్రమ కట్టడాలను కూల్చాలి

భోగాపురం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎస్సీలు, బీసీలకు మంజూరు చేసిన స్థలంలో అనుమతులు లేకుండా నిర్మించిన గృహాలను తక్షణమే తొలగించాలని చెరుకుపల్లి గ్రామస్థులు కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ రమణమ్మకు, పోలీస్‌స్టేషన్‌లో సీఐ కె.దుర్గాప్రసాదుకు వినతిపత్రం అందజేశారు. రామ్‌చైతన్య, రిక్కా ఆదినారాయణ, ఉదయ్‌కుమార్, గోకా సీతాదేవి, రిక్కలక్ష్మి పైడమ్మ తదితరులు పాల్గొన్నారు.

లెండిలో ఏఐ సీటీఐడీఏ ప్రారంభం

డెంకాడ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): లెండి ఇంజనీరింగ్ కళాశాలలో మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు ఆరిఫిషియల్ ఇంటిలిజెన్స్, కంప్యూటింగ్ టెక్నాలజీస్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ డేటా అనలిటిక్స్ కాన్ఫరెన్స్‌లో భాగంగా విభిన్నంగా ఏర్పాటుచేసిన ప్రాజెక్టు ఎక్స్‌పో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా వివిధ ఇంజనీరింగ్ శాఖలకు చెందిన విద్యార్థులు, పరిశోధకులు రూపొందించిన అత్యాధునిక నమూనాలు, పరిశోధనల ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రామారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వి.అంజిరెడ్డి, పలువురు విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'గురుదేవ'తో భాగస్వామ్యం గర్వకారణం

కొత్తవలస, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): గురుదేవ చారిటబుల్ ట్రస్టుతో కలిసి పనిచేయడం ఎంతో ఆనందంగా ఉందని దక్షిణ ఆసియా ఎల్‌పీజీ సంస్థ సీఈవో రిచా షిండే అన్నారు. మంగళపాలెం గ్రామంలోనున్న గురుదేవ చారిటబుల్ ట్రస్టును ఆయన గురువారం సందర్శించారు. ఈ ట్రస్టులో తమ సంస్థ కూడా భాగస్వామ్యం కావడం గర్వంగా ఉందన్నారు. అనంతరం ఆయన 250 మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను పంపిణీ చేశారు. అంధులకు పింఛన్ అందజేశారు. దక్షిణ ఆసియా ఎల్‌పీజీ సంస్థ ప్రతినిధి రామ్‌నాథ్, ట్రస్టు చైర్మన్ జగదీష్‌బాబుతో పాటు వైస్ చైర్మన్ ఫణీంద్ర పాల్గొన్నారు.

ఎండీఎం ప్రైవేటీకరణ తగదు

రాజాం రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ కిచెన్ పేరిట మున్సిపల్ పట్టణాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను ప్రైవేటీకరిస్తే చూస్తూ ఊరుకోబోమని ఎండీఎం కార్మికుల యూనియన్ నాయకుడు రామ్మూర్తినాయుడు ప్రకటించారు. రాజాంలో గురువారం ఆయన మాట్లాడారు. గత 20 ఏళ్లుగా పాఠశాలల్లో నిర్వహిస్తున్న వారిని కాదని సామూహిక వంటశాల పేరుతో ఒకేచోట వంట చేసేందుకు విద్యాశాఖ ప్రయత్నిస్తోందన్నారు. ఈ విధానానికి స్వస్తి పలకాలని.. లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

వీఆర్వోపై చర్యలు తీసుకోండి

ఎస్.కోట రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తుఫాన్ సమయంలో కొండమల్లిపూడి పరిధిలోని గిరిజనులను చిన్నచూపు చూడటమే కాకుండా వారి పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన వీఆర్వో చోటానూర్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా నేతలు గాడి అప్పారావు, మద్దిల రమణ కోరారు. గురువారం వీరు ఆ గ్రామాన్ని సందర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఇళ్లు కారిపోతున్నాయి.. పునరావాసం కల్పించాలని గిరిజనులు కోరితే, ఎదురుగా ఉన్న భవనంలో ఉండండి.. అది కారిపోతే తహసీల్దార్‌కు చెప్పుకోండని వీఆర్వో చెప్పడం దారుణమన్నారు. దీనిపై వీఆర్వోను వివరణ కోరగా తాను ఎవరి పట్ల అనుచితంగా మాట్లాడలేదని, మూడు రోజులపాటు వారికి అందుబాటులో ఉన్నానని చెప్పారు.

జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి చేయాలి

విజయనగరం రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి చేయాలని ఉత్తరాంధ్ర విద్యార్థి సేన వ్యవస్థాపక అధ్యక్షుడు డా.సుంకరి రమణమూర్తి కోరారు. గురువారం జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయం వీసీగా బాధ్యతలు చేపట్టిన సుబ్బారావును ఆయన మర్యాదపూర్వకంగా కలిసి, సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రాంతంలో ఏకైక సాంకేతిక విశ్వవిద్యాలయం ఒక్కటేనని.. దీనిని అభివృద్ధి పరచాల్సింది పోయి, స్వార్థపూరిత ఆలోచనలతో గత పాలకులు తీసుకున్న అవినీతి నిర్ణయాలతో విశ్వవిద్యాలయం ప్రతిష్ఠ దిగజారిందన్నారు. ఇప్పటికైనా రాజకీయాలతో సంబంధం లేకుండా యూనివర్సిటీని అభివృద్ధి చేయాలన్నారు.

వరి పంటకు నష్టం

గజపతినగరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా మండలంలోని 61 హెక్టార్లలో వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లిందని మండల వ్యవసాయ అధికారి కిరణ్‌కుమార్‌నాయుడు గురువారం తెలిపారు. మండల పరిధిలోని 18 గ్రామాల్లో వరిపంట ముంపునకు గురైనట్టు గుర్తించామని చెప్పారు.



రాజాం: రాజియ్యపేటలో నేలకొరిగిన వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

అలాగే 168 మంది రైతులకు చెందిన పంట నీటి మునిగిపోయిందని తెలిపారు. గంగచోళ్లపెంటలో బట్టి కాలువ ఉధృతం కావడంతో సుమారు 20 ఎకరాల పంటకు నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. ● దత్తిరాజేరు: తుఫాన్ కారణంగా మండలంలోని 12 ఎకరాల్లో వరిపంట నేలకొరిగినట్టు వ్యవసాయ అధికారిణి అనూరాధ తెలిపారు. షికారుగంజి గ్రామంలో ఓ చెట్టు మీద విద్యుత్ తీగలు పడిపోవడంతో మాజీ సర్పంచ్ సత్యారావు దగ్గరుండి తొలగించే పనులు చేపట్టారు. అలాగే పెదమానాపురంలో ఎకరా అరటిపంట ధ్వంశమైంది. ● బొండపల్లి: కనిమెరక గ్రామంలో చెరువుల్లో నీరు పంట పొలాల్లో చేరింది. కనిమెరక-గజపతినగరం వెళ్లే రహదారి కోతకు గురయ్యింది. బొండపల్లిలో బొడ్డి చెరువు కట్టలు తెగడంతో జగనన్న కాలనీ జలమయమైంది. దీంతో స్థానిక ఎంపీడీవో గిరిబాల నీరు మళ్లించేలా చర్యలు చేపట్టారు. అలాగే మరువాడ, ఎం.కొత్తవలస మధ్య మజ్జి చెరువు కింద పంట పొలాలు నీటమునగడంతో ఈవోపీఆర్‌డీ ఎ.రఘుపతిరావు సహాయక చర్యలు చేపట్టారు. అలాగే దేవుపల్లి కేజీబీవీలో నీరు నిల్వ ఉండడంతో విద్యార్థులు అవస్థలు పడ్డారు. నెలివాడలో 3 కుటుంబాలు, కనిమెరక, దేవుపల్లిలో ఒక్కొక్క కుటుంబానికి తహసీల్దార్ డోలా రాజేశ్వరరావు నిత్యావసర సరుకులకు అందజేశారు. ● రాజాం: నష్టపోయిన రైతులకు ప్రభుత్వ పరంగా నష్ట పరిహారం అందించేలా చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ ఏడీ కె.చంద్రరావు తెలిపారు. రాజియ్యపేటలో నేలకొరిగిన వరిపంటను ఆయన గురువారం పరిశీలించారు. ఆయన వెంట ఏవో రఘునాథ్ ఉన్నారు. ● డెంకాడ: ముంపునకు గురైన వరిపంటను జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు పరిశీలించారు. విజయనగరం డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడు నాగభూషణరావు, ఏవో సంగీతలతో కలిసి చొల్లంగిపేట, నగరపేట గ్రామాల్లో పర్యటించి వరిపంటను పరిశీలించారు.

ముందస్తు సహాయక చర్యలు

సంతకవిటి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నాగావళి నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రెవెన్యూ, పోలీసు సిబ్బంది గురువారం ముందస్తుగా చర్యలు చేట్టారు. తహసీల్దార్ సుదర్శనరావు, ఎస్ఐ ఆర్.గోపాలరావు నదీ తీర గ్రామాల్లో పర్యటించి ప్రజలకు సూచనలు చేశారు.



ప్రజలకు సూచనలు చేస్తున్న ఎస్ఐ

అన్నదాతకు అపార నష్టం

● క్షేత్రస్థాయిలో పరిశీలించిన అధికారులు

బొబ్బిలి, బాడంగి, రామభద్రపురం, తెర్లాం మండలాల్లో మొంథా తుఫాన్ వల్ల అన్నదాతకు అపారనష్టం జరిగింది. ఎడతెరిపిలేని కురిసిన వర్షంతోపాటు ఈదురుగాలులకు పంటలు దెబ్బతిన్నాయి. వర్షాలు తెరిపివ్వడంతో క్షేత్రస్థాయిలో అధికారులు నష్టాలను పరిశీలిస్తున్నారు.

●బొబ్బిలి రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇప్పటి వరకు వరి 2.5, పత్తి 1.2, మొక్కజొన్న 1.5 హెక్టార్లలో నష్టం జరిగినట్లు గుర్తించామని ఏవో మజ్జి శ్యామ్‌సుందర్ తెలిపారు. పంట నష్టంపై క్షేత్రస్థాయి పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని చెప్పారు. గురువారం బొబ్బిలిలో మాట్లాడుతూ పంట నష్టంపై పూర్తి వివరాలను సేకరించి రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కల్లాలు, ఇంటి వద్ద మొక్కజొన్నకు పరిహారం రాదని చెప్పారు. కాగా పారాది, నారాయణప్పవలస, పెంట, గొర్లెసీతారాంపురం, గున్నతోటవలస తదితర గ్రామాల పొలాల్లో వరి పంట నేలమట్టమయ్యింది.పారాది వద్ద వేగావతి నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో నదిబొడ్డున ఉన్న పంప్‌హౌస్ నీటమునిగింది. వరదతగ్గగానే పంప్ హౌస్‌ను పునరుద్ధరిస్తామని డీఈ తెలిపారు. కారాడలో తహసీల్దార్ ఎం.శ్రీనుతో కలిసి ఎంపీడీవో పి.రవికుమార్ పర్యటించి వేగావతి నది ఒడ్డున ఉన్న పంపుహౌస్ పరిశీలించారు. కారాడలోఉన్న 42 మందిని పునరావాస కేంద్రానికి తరలించారు. కాగా రంగరాయపురం శివారున గల చెరువు నిండి నీరు రోడ్డుపైకి రావడంతో వాహనచోదకులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీడీవో పి.రవికుమార్ నీరు రోడ్డుపైకి రాకుండా పూడికలు తీయించి, మట్టికాలువలను క్లియర్ చేయించి నీటిని మళ్లించే ఏర్పాట్లు చేశారు. ఆయన వెంట డిప్యూటీ ఎంపీడీవో భాస్కరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.కారాడలో ఏర్పటు చేసిన పునరావాస కేంద్రంలో గల 16 కుటుంబాలకు సీఎస్‌డీటీ సాయికృష్ణ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

వంద ఎకరాల్లో పంటలు నష్టం

రామభద్రపురం,అక్టోబరు30(ఆంధ్రజ్యోతి):మండలంలో సుమారు వంద ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయాధికారులు ప్రాథమిక అంచనావేశారు. వరి 60 ఎకరాలు, మొక్కజొన్న 39 ఎకరాలు, పత్తి 15 ఎకరాల్లో నష్టం వాటిల్లిందని తెలిపారు. ఇంకా పూర్తిస్థాయిలో నివేదికలు తెప్పించడానికి వ్యవసాయ సిబ్బంది గ్రామాల్లో సర్వే చేయనున్నారని ఏవో అమరా శివ తెలిపారు. కూరగాయ పంటలకు కూడా ఎక్కువ నష్టం వాటిల్లడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గంగన్నపాడులో పారిశుధ్య పనులు

తెర్లాం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి):గంగన్నపాడులో వర్షాలకు వరద నీరు చేరడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ హేమంత్ కూమార్, ఎంపీడీవో రాంబాబు ఆధ్వర్యంలో పారిశుధ్యపనులు ప్రారంభించారు. వాటర్ ట్యాంక్, బోరు, నేలబావిలో క్లోరినేషన్ ప్రక్రియ చేపట్టారు. గ్రామంలో మెడికల్ క్యాంప్‌లు నిర్వహించారు. పది బాధిత కూటుంబాలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ ౘైర్మన్ నర్సుపల్లి వెంకటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ వెంకటనాయుడు పాలొన్నారు.

●బాడంగి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి):మండలంలోని వాడాడలో -13, రామచంద్రాపురంలో 23, ముగడలో పది తుఫాన్ బాధిత కుటుంబాలకు 50 కేజీల బియ్యం, పంచధార, నూనె, కందిపప్పు, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు కేజీ చొప్పున పంపిణీ చేసినట్లు తహసీల్దార్ వరప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ, విలేజ్ సెక్రటరీ పాల్గొన్నారు.



రామభద్రపురం: ఇట్లామామిడిపల్లిలో పాడైన పత్తిపంట



బొబ్బిలి రూరల్: పారాది వద్ద వేగావతి ప్రవాహంలో మునిగిపోయిన పంపు హౌస్

ఎంత కష్టం!

(ఐదో పేజీ తరువాయి)

ఒకటి నుంచి ఐదు వరకు ఇళ్ల గోడలు పడిపోవడం, పెంకుటిళ్ల వాసాలు ఊడిపోవడం జరిగింది. పొలాల్లో వరి పంట మునగడం, ఓ వైపు వాలిపోవడంతో దిగు బడులు కోల్పోతామని రైతులు బాధపడుతున్నారు. వ్యవసాయ శాఖ నష్టాన్ని లెక్కిస్తున్నప్పటికీ పరిహారంపై ఖచ్చితమైన హామీ ఇవ్వడం లేదు. దిగుబడులు రాని విధంగా పంటకు నష్టం జరిగితే పరిహారానికి నివేదిస్తామని చెబుతున్నారు. రిజర్వాయర్ల నుంచి వస్తున్న వరద నీటి వల్ల నదులను దాటి అధికారులు వెళ్లలేని పరిస్థితి. అక్కడి పొలాల్లో పంట, కళ్లాల్లో పశువుల స్థితిని అధికారులు చూసేందుకు వీలులేకపోవడంతో నష్ట పరిహారం అందుతుందో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో 4,500 ఎకరాల్లో వివిధ పంటలు మునిగినట్లు అధికారులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. గురువారం నాటికి వాన తెరిపివ్వడంతో రైతులు పంటను కాపాడుకొనేందుకు పొలంబాట పట్టారు. పంటను గుత్తులుగా కట్టి నిలబెడుతున్నారు. నీరు పోయేందుకు చేనును పాయలుగా విడదీస్తున్నారు.

రూ.110 కోట్ల నష్టం

(ఐదో పేజీ తరువాయి)

వరి పంట నేలవాలింది. పత్తి 14 హెక్టార్లు, మొక్కజొన్న 14 హెక్టార్లలో నష్టం వాటిల్లింది. 30 మంది రైతులకు చెందిన కాలీఫ్లవర్, బొప్పాయి, అరటి వంటి పంటలు 12 హెక్టార్లలో దెబ్బతిన్నాయి. కాగా తుఫాన్ వల్ల జిల్లాలో భారీగా రహదారులకు నష్టం వచ్చింది. ఆర్అండ్‌బీ విషయానికి వచ్చేసరికి 98 కిలో మీటర్ల మేర రహదారి పాడైంది.

● జిల్లాలోని ఇరిగేషన్ పరిధిలో 184 సోర్సు దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. వీటికి రూ.23.4 కోట్లు అవసరం పడుతున్నట్లు అధికారులు అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. గ్రామీణ మంచినీటి విభాగం పరిధిలో దెబ్బతిన్న 34 వర్కులకు సంబంధించి రూ.38 లక్షలకు ప్రతిపాదనలు పంపారు. విద్యుత్ శాఖ విషయంకు వచ్చేసరికి 67 స్తంభాలు నేల కూలగా, 23 ఫీడర్లు దెబ్బతిన్నాయి.

నష్టాన్ని సమగ్రంగా నమోదు చేయండి

(ఐదో పేజీ తరువాయి)

జరిగిన నష్టాన్నీ నమోదు చేయాలన్నారు. వరద పరిస్థితులపై జిల్లా అధికారులతో గురువారం ఉదయం ఆయన టెలీకాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. జలశయాలన్నిటిలో ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లోను పరిశీలిస్తూ ఎక్కడా ఎటువంటి నష్టాలూ జరగకుండా చూడాలన్నారు. జలశయాల్లో నీటి స్థాయిలు సాధారణ స్థితికి వచ్చే వరకూ పర్యవేక్షించాలని, వచ్చే రెండు రోజులు కూడా జాగ్రత్తలు వహించాలని సూచించారు. అనంతరం జేసీ సేతు మాధవన్ మాట్లాడుతూ తుఫాన్ బాధితులకు 50 కేజీలు చొప్పున బియ్యం, ఆయిల్ లీటరు, చెక్కర కేజీ, ఉల్లిపాయలు, కేజీ బంగాళ దుంపలు చొప్పున పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పునరావాస శిబిరాల్లో ఉన్నవారికి 25 కేజీలు చొప్పున బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు అందించనున్నట్లు తెలిపారు. ఈ సరుకులు సక్రమంగా అందేలా తహసీల్దార్లు చర్యలు తీసుకోవాలన్నారు.

వ్యర్థాలు కలెక్టరేట్ ప్రాంగణంలో వేస్తే సహించేది లేదు

కలెక్టరేట్ పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాల్లోని వ్యర్థాలు కలెక్టరేట్ ప్రాంగణంలోకి వేస్తే సహించేది లేదని కలెక్టరు రామసుందర్ రెడ్డి హెచ్చరించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో శుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, కార్యాలయాలు పరిశుభ్రంగా పచ్చదనంతో ఉండేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబునాయుడు ఆదేశించినట్లు తెలిపారు.

నాగావళి నది హెచ్చుతగ్గులను గమనించండి: కలెక్టర్

నాగావళి నది ప్రవాహం పెరగొచ్చునని, హెచ్చుతగ్గులను గమనిస్తూ లోతట్టు ప్రజలను అప్రమత్తం చేయాలని కలెక్టర్ రామసుందర్‌రెడ్డి ఆదేశించారు. ముంపు ప్రాంతాలను పరిశీలించేందుకు ఆయన గురువారం రేగిడి మండలంలో పర్యటించారు. సంకిలి వద్ద నాగావళి వరద పోటును పరిశీలించారు. ఆర్డీవో శాంతి, తహసీల్దార్ కృష్ణలత, ఇరిగేషన్ డీఈఈ రమేష్‌కు సూచనలు ఇచ్చారు. వర్షాలకు జరిగిన నష్టాన్ని సమగ్రంగా అంచనా వేయాలని, సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి ఖచ్చితమైన నివేదికలు ఇవ్వాలని సిబ్బందికి నిర్దేశించారు. ఆయన వెంట ఎంపీడీవో శ్యామలాకుమారి ఉన్నారు.

కూటమి బలోపేతమే లక్ష్యం

(ఐదో పేజీ తరువాయి)

తీసుకోవాల్సిన చర్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రాజెక్టుల నిర్మాణం, కొత్త పరిశ్రమల ఏర్పాటు, ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుపైనా మాట్లాడారు. అదే విధంగా పనులు చేపట్టి బిల్లులు కోసం ఎదురుచూస్తున్న కాంట్రాక్టర్ల అంశం కూడా చర్చ వచ్చినట్లు సమాచారం.

చివరిగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో కూటమి బలోపేతమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అందరూ సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ప్రభుత్వంపై ప్రతిపక్షాలు విమర్శలు చేసే సందర్భంలో ఎవరి స్థాయిలో వారు ఖండించాలని సూచించారు. నాయకులు అంతా సమన్వయంగా వుండాలని, కార్యకర్తలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కూడా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని మంత్రి సూచించారు.

నాణ్యత పరీక్షలు 'నీటి' మూటలేనా?

(ఐదో పేజీ తరువాయి)

లేదు.రక్షిత నీటి పథకంలో నీరు బాగున్నా పైపులైన్ల లీకులతో కలుషిత జలాలు వెళ్లే అవకాశం ఉంది. అందుకే ఒక నమూనా తాగునీటి చేతిపంపు నుంచి, మరో నమూనాను రక్షిత నీటిపథకంలోంచి, ఇంకొకటి వీధి కోళాయి దగ్గర సేకరించి పరీక్షలు చేయాలి. ఎక్కడా ఇలా జరగడం లేదు.

ఇలా ఉంటే సురక్షితం

● నీటి పీహెచ్ విలువ 6.4 నుంచి 8.5ఉండాలి.

● రంగు, రుచి, వాసన, మడ్డితనం 5నుంచి 10 యూనిట్లు వరకు ఉండాలి.

●లీటరు నీటిలో కాఠిన్యత 200-600 మిల్లీగ్రాములు, ఫ్లోరైడ్ 10, ఇనుము 0.3, సల్ఫేట్ 200 మిల్లీగ్రాముల చొప్పున ఉంటే సురక్షితమని ఈస్థాయి కంటే ఎక్కువైనా, తక్కువైనా ఆరోగ్యానికి మంచిది కాదని నిపుణులు చెబుతున్నారు.

ఇవీ అనర్థాలు

● నీటిలో క్లోరిన్ శాతం అధికంగా ఉంటే చర్మవ్యాధులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు.

● పరిమితికి మించి ఫ్లోరైడ్ ఉంటే ఫ్లోరోసిస్ సోకుతుంది.

● ఇనుము శాతం ఎక్కువగా ఉన్నా ఇబ్బందులు ఉంటాయి.

నిర్లక్ష్యం తగదు

సచివాలయ పరిధిలో తాగునీటి వనరులకు క్రమం తప్పకుండా పరీక్షలు చేయాలి. అందులో వచ్చిన ఫలితాలు ఎప్పటికప్పుడు తెలియజేయాలి. ఎక్కడైనా లోపాలు ఉంటే వాటిని సరిదిద్దడానికి చర్యలు తీసుకుంటాం. పరీక్షల విషయంలో అలసత్వం వహిస్తే ఉపేక్షించం.

- బి.కళ్యాణి. ఎంపీడీవో, గజపతినగరం



సబ్ జైలు రికార్డులను పరిశీలిస్తున్న కృష్ణ ప్రసాద్

సబ్ జైలు తనిఖీ

శృంగవరపుకోట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఎస్.కోట సబ్ జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణ ప్రసాద్ గురువారం తనిఖీ చేశారు. ఖైదీలకు న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. చట్టాలపై అవగాహన కల్పించారు. ఖైదీలపై వివక్ష చూపితే చర్యలు ఉంటాయన్నారు. అనంతరం లీగల్ ఎయిడ్ క్లీనిక్‌ను పరిశీలించారు. అలాగే వంట సరుకులు, పప్పుదినుసులు పరిశీలించి, పాడైనట్టు గుర్తించారు.

నీటి కలుషితం వల్లే డయేరియా: ఎమ్మెల్యే

రామభద్రపురం,అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో ఏడొంపులగెడ్డ పొంగి పొర్లడంతో తాగునీరు కలుషితమై డయేరియా సోకిందని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన తెలిపారు. ముచ్చర్లవలస, బూసాయవలసల్లో 16 మంది డయేరియా బారినపడ్డారని, వారిలో కొందరి ఆరోగ్య పరిస్థితి కుదుట పడిందని చెప్పారు. గురువారం రామభద్రపురంలో డయేరియా రోగులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండడంతో పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగుపరచాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు మడక తిరుపతినాయుడు, పార్టీ మండలాధ్యక్షులు కరణం విజయ భాస్కరరావు, ఎంపీటీసీ సభ్యులు భవిరెడ్డి చంద్ర, వసంతుల తిరుపతిరావు, ముచ్చర్లవలస సర్పంచ్ కనిమెరక శంకరరావు, టీడీపీ నాయకులు సీహెచ్.రామకృష్ణ, చొక్కాపు రామారావు, గంట సాయి, వసంతుల వెంకటరావు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, వైద్య శిబిరాలు నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జీవనరాణి ఆదేశించారు. గురువారం రామభద్రపురం పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు ఎక్కువగా జరిగే విధంగా కృషి చేయాలని కోరారు. అనంతరం డయేరియా సోకిన బూసాయవలస, ముచ్చర్లవలస గ్రామాల్లో పర్యటించి అక్కడి పరిస్థితిని పరిశీలించారు. వైద్యాధికారులతో మాట్లాడి డయేరియా అదుపునకు అన్ని చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రామభద్రపురం పీహెచ్‌సీ అధికారులు లక్ష్మి, దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

బొబ్బిలి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలో పలువురికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే బేబీనాయన గురువారం బొబ్బిలి దర్బారుమహల్‌లో లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు, టీడీపీ నాయకులు ఏగిరెడ్డి శ్రీధర్, కాకల వెంకటరావు,ఎక్కుడు వాసు, మడక అప్పారావు పాల్గొన్నారు.

భూములిచ్చి మోసపోయాం

ఎస్.కోట రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): జిందాల్ పరిశ్రమకు 18 ఏళ్ల కిందట భూములు ఇచ్చి మోసపోయామని.. దీనిపై 132 రోజులుగా తుఫాన్‌లా నిరసన దీక్షలు చేస్తున్నా పట్టించుకోకపోవడం దారుణమని జిందాల్ నిర్వాసితులు ఆవేదన వ్యక్తంచేశారు. గురువారం బొడ్డవరలో నిర్వహిస్తున్న రిలే దీక్షలో వారు మాట్లాడారు. తుఫాన్ వర్షాలకు రాష్ట్రం అంతా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసిన ముఖ్యమంత్రి ఈ పరిశ్రమకు భూములు ఇచ్చి నష్టపోయిన హరిజన, గిరిజన, మైనార్టీలను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు.



రిలే దీక్ష చేస్తున్న జిందాల్ నిర్వాసితులు

11 గొర్రెలు మాయం

తెర్లాం, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): మండలంలో విజయరాంపురానికి చెందిన వంజరాపు సత్యం గొర్రెలను బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారని సర్పంచ్ బూరి మధుసూదనరావు, బాధితుడు సత్యం తెలిపారు. రోజులాగే గ్రామ సమీపంలోని గొర్రెలశాలలో మందను ఉంచామని, ఉదయం వెళ్లి చూసేసరికి గొ ర్రెలు లేవని చెప్పారు. చుట్టుపక్క గ్రామాల్లో వెతికినా ఎక్కడా దొరకలేదని సత్యం వాపోయాడు.

'సఖి సురక్ష' మహిళలకు వరం

బొబ్బిలి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఎన్‌యూహెచ్‌ఎం, ఈ-వైద్య ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా అమలవుతున్న సఖి సురక్ష పథకం మహిళలకు వరం వంటిదని మునిసిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు తెలిపారు. గురువారం బొబ్బిలిలోని శ్రీ కళాభారతి ఆడిటోరియంలో మెప్మా ఆధ్వర్యంలో మహిళా స్వయం సహాయసంఘాల గ్రూపులకు చెందిన మహిళలకు ఆరోగ్యతనిఖీలు నిర్వహించారు. మెప్మా టీపీఆర్‌వో మామిడి జగన్మోహన రావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వెయ్యిమంది ఎస్‌హెచ్‌జీ సభ్యులకు రక్త పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి పాల్గొన్నారు.

లక్ష్యసాధన కోసం కృషి చేయాలి

బొబ్బిలి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): లక్ష్యసాధన కోసం కృషిచేయాలని న్యాయాధికారి ఎం.రోహిణిరావు కోరారు. గురువారం బొబ్బిలి సాంఘికసంక్షేమశాఖ కళాశాల బాలికల వసతిగృహంలో నిర్వహించిన కార్యక్రమంలో చట్టాలు, లైంగిక వేధింపులకు సంబంధించి గుడ్‌టచ్, బ్యాడ్ టచ్, హ్యూమన్ ట్రాఫికింగ్‌పై వివరించారు. అనంతరం ఆమె స్థానిక సబ్‌జైలులో రిమాండ్‌లో ఉన్న ఖైదీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

జిల్లా ముఖచిత్రం మారుతుందా?

(ఐదో పేజీ తరువాయి)

పార్వతీపురం మన్యం జిల్లాలో కలిపారు. ఇక్కడ కూడా విలీనాన్ని ఆయా ప్రాంతాల ప్రజలు ఇప్పటికీ అంగీకరించడం లేదు. ఈ పరిస్థితిలో ఏ నియోజకవర్గాన్ని కదిపినా మళ్లీ కొత్త సమస్య వస్తుందన్న ఆలోచనతో ఈ మూడు జిల్లాల్లో కొనసాగుతున్న అసెంబ్లీ నియోజకవర్గాలను యథాతథంగా ఉంచాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. విజయనగరం జిల్లా 27 మండలాలతో, పార్వతీపురం మన్యం జిల్లా 15 మండలాలతో కొనసాగుతాయి.

మెంటాడను ఏం చేస్తారో?

రెవెన్యూ డివిజన్ల మార్పు మాత్రం అనివార్యంగా కనిపిస్తోంది. ఒకే నియోజకవర్గంలోని మండలాలు ఒకే రెవెన్యూ డివిజన్‌లోనే కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. అదే విషయాన్ని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రకటించారు. ఇదే జరిగితే జిల్లాలో కొన్ని మార్పులు వస్తాయి. జిల్లాలో విజయనగరం, బొబ్బిలి, చీపురుపల్లి రెవెన్యూ డివిజన్లు కొనసాగుతున్నాయి. మెంటాడ మండలం విజయనగరం జిల్లాలో కొనసాగుతుండగా, అసెంబ్లీ నియోజకవర్గపరంగా సాలూరులో ఉంది. రెవెన్యూ డివిజన్ పరంగా బొబ్బిలిలో ఉంది. పార్వతీపురం మన్యం జిల్లాలోనే మెంటాడను కొనసాగించాలని అప్పట్లో భావించారు. ఆ మండల ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించడంతో నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నారు. అయితే ఇప్పుడు ఒకే నియోజకవర్గం, ఒకే రెవెన్యూ డివిజన్ అని ప్రభుత్వం నిర్ణయించడంతో ఏం జరుగుతుందో చూడాలి. అంతేకాకుండా విజయనగరం డివిజన్‌కు దగ్గరగా ఉన్న గజపతినగరం, దత్తిరాజేరు మండలాలు బొబ్బిలి డివిజన్‌కు మారటంతో ఏదైనా పనిమీద ఆర్డీవో ఆఫీస్‌కి వెళ్లాలంటే దూరం కావటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తిరిగి ఈ రెండుమండలాలను విజయనగరంలో చేర్చాలని కోరుతున్నారు.

విజయనగరం డివిజన్‌లో..

విజయనగరం రెవెన్యూ డివిజన్లో ఎస్.కోట, వేపాడ, లక్కవపురపుకోట, కొత్తవలస, జామి, బొండపల్లి, పూసపాటిరేగ, భోగాపురం, డెంకాడ, నెల్లిమర్ల, గంట్యాడ మండలాలు కొనసాగుతున్నాయి. ఇందులో బొండపల్లి, గంట్యాడ, గజపతినగరం నియోజకవర్గంలో ఉన్నాయి. అదే నియోజకవర్గం పరిధిలోని గజపతినగరం, దత్తిరాజేరు మండలాలు బొబ్బిలి రెవెన్యూ డివిజన్‌లో కొనసాగుతున్నాయి. అయితే గంట్యాడ, బొండపల్లిని బొబ్బిలి డివిజన్‌లో చేర్చుతారా? లేకుంటే గజపతినగరం, దత్తిరాజేరును విజయనగరం డివిజన్‌లో చేర్చుతారా? అన్నది తెలియాల్సి ఉంది.

చీపురుపల్లిలో..

చీపురుపల్లి రెవెన్యూ డివిజన్‌లో ఎనిమిది మండలాలు కొనసాగుతున్నాయి. చీపురుపల్లి, గుర్ల, గరివిడి, మెరకముడిదాం, రాజాం, సంతకవిటి, రేగిడి, వంగర మండలాలు కొనసాగుతున్నాయి. తీవ్ర తర్జనభర్జన నడుమ చీపురుపల్లి రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటుచేశారు. అప్పట్లో శ్రీకాకుళం జిల్లాలోని గంగువారి సిగడాం మండలాన్ని, నెల్లిమర్ల మండలాన్ని చీపురుపల్లిలో ఉంచారు. కానీ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం కావడంతో జి.సిగడాంను శ్రీకాకుళం రెవెన్యూ డివిజన్‌లో, నెల్లిమర్లను విజయనగరం డివిజన్‌లో చేర్చారు. ప్రస్తుతానికి చీపురుపల్లి డివిజన్‌లో రెండు నియోజకవర్గ పరిధిలో మండలాలు ఉన్నాయి. దీంతో ఎటువంటి చేర్పులు, మార్పులకు ఛాన్స్ లేదు.

బొబ్బిలిలో...

బొబ్బిలి రెవెన్యూ డివిజన్ పరిధిలో బొబ్బిలి, రామభద్రపురం, తెర్లాం, బాడంగి, గజపతినగరం, దత్తిరాజేరు, మెంటాడ మండలాలు ఉన్నాయి. ఇందులో గజపతినగరం నియోజకవర్గం నుంచి బొండపల్లి, గంట్యాడ మండలాలు చేరాలి. లేకుంటే గజపతినగరం, దత్తిరాజేరు విడిపోవాలి. మెంటాడ సమస్య ఎలాగూ నలుగుతోంది. దీనిపై తప్పకుండా ప్రభుత్వం ఏదో ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. అంటే బొబ్బిలి డివిజన్‌లో చేర్పులు, మార్పులు ఉండబోతున్నాయన్న మాట.

హెన్రీ డ్యునాంట్‌కు నివాళి

రాజాం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు జాన్ హెన్రీ డ్యునాంట్ వర్ధంతి కార్యక్రమం గురువారం రాజాంలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఎంపీడీవో ఆనందరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వి.శ్రీనివాసరావు, రెడ్‌క్రాస్ చైర్మన్ కొత్త సాయిప్రశాంత్‌కుమార్, మక్క. అప్పలనాయుడు, జాతీయ యువజన అవార్డు గ్రహీత పెంకిచైతన్యకుమార్, మోటివేషనల్ స్పీకర్ బూరాడ శివకృష్ణ, రోటరి క్లబ్ అధ్యక్షుడు గట్టి పాపారావు, పండూరి వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు,